సాక్షి ఖమ్మం

గురువారం । 10 । జూలై । 2025



నీటి విడుదలకు కసరత్తు

సాగర్ కాల్వల ద్వారా సాగునీటి విడుదలపై ఈనెల 11న హైదరాబాద్‌లో జరగనున్న సమావేశంలో స్పష్టత రానుంది. 8లో



టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుతోనే..

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేస్తేనే ఆలయాల భూములకు రక్షణ లభిస్తుందని అర్చక, ఉద్యోగ జేఏసీ ప్రతినిధులు పేర్కొన్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 25°

వాతావరణం

జిల్లా అంతటా గురువారం సాధారణ ఉష్ణోగ్రతలే ఉంటాయి. కొన్నిచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బీఈడీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని గిరిజన బీఈడీ కళాశాలలో రెగ్యులర్ బీఈడీ కోర్సు (2025–27)లో ప్రవేశానికి ఏజెన్సీ షెడ్యూల్ ప్రాంత గిరిజన పట్టభద్రుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. డిగ్రీ కనీసం 40శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన తెలంగాణలోని గిరిజన అభ్యర్థులు అర్హులని, డిగ్రీ మార్కుల ఆధారంగా ఎంపిక ఉంటుందని వెల్లడించారు. మొత్తం 100 సీట్లలో మహిళలు, ప్రత్యేక కేటగిరీ వారికి రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు. ఏటూరు నాగారం, ఉట్నూరు, మన్ననూరు ఐటీడీఏ కార్యాలయాలతో పాటు భద్రాచలం గిరిజన బీఈడీ కళాశాలలో దరఖాస్తులు తీసుకుని, ఆగస్టు 8వ తేదీ వరకు అందజేయాలని, వివరాలకు 89784 77345 నంబర్‌లో సంప్రదించాలని పీఓ సూచించారు.

బౌద్ధక్షేత్రం భూముల స్వాధీనానికి సర్వే



సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్, ఉద్యోగులు

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని బౌద్ధ క్షేత్రానికి సంబంధించి రూ.కోట్ల విలువైన భూములను ఆక్రమణ నుంచి విడిపించేందుకు అధికారులు రంగంలోకి దిగారు. ప్రభుత్వ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు సర్వే చేస్తూ క్షేత్రం భూముల్లో హద్దు రాళ్లు ఏర్పాటుచేస్తున్నారు. నేలకొండపల్లిలో దక్షిణ భారతదేశంలోకెల్లా అతి పెద్దదైన బౌద్ధక్షేత్రం పేరిట 55.23 ఎకరాల భూములు ఉన్నాయి. కానీ చాలావరకు ఆక్రమణకు గురవగా ప్రస్తుతం 20 ఎకరాల మేర మిగిలినట్లు తెలిసింది. ఈ అంశంపై పలువురి ఫిర్యాదుతో స్పందించిన ప్రభుత్వం భూములను స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది. దీంతో రెవెన్యూ అధికారులు రెండు రోజులుగా సర్వే చేస్తూ భూములను గుర్తించి హద్దురాళ్లు ఏర్పాటుచేశారు. సర్వేలో తహసీల్దార్ వి.వెంకటేశ్వర్లు, ఎంఆర్‌ఐలు ఆలస్యం మధుసూదన్ రావు, అల్లం రవి, సర్వేయర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు. అయితే, రాళ్లు పాతిన ప్రాంతంలో తమ పట్టాభూములు ఉన్నాయని కొందరు రైతులు చెప్పగా పూర్తి స్థాయిలో విచారణ చేపడుతామని తెలిపారు. కాగా, సర్వేతో సరిపెట్టకుండా భూములను స్వాధీనం చేసుకోవాలని సామాజిక కార్యకర్త పసుమర్తి శ్రీనివాస్ తదితరులు కోరారు.

గురుపౌర్ణమి పూజలకు ముస్తాబు

ఖమ్మంగాంధీచౌక్: గురుపౌర్ణమి వేడుకను గురువారం జరుపుకోనుండగా షిర్డీ సాయి బాబా ఆలయాలు, ఆశ్రమాల్లో ఏర్పాట్లు చేశారు. ఆషాఢ శుద్ధ పంచమి నుంచి ప్రారంభమైన వేడుకలు పౌర్ణమితో ముగియనున్నాయి. ఈ సందర్భంగా 11 రోజుల పాటు మందిరాలు, ఆశ్రమాల్లో ప్రత్యేక హోమాలు, అభిషేకాలు చేసిన నిర్వాహకులు గురువారం గ్రామోత్సవాలు, అభిషేకాలకు సిద్ధమయ్యారు. ఈమేరకు జిల్లాలోని ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు.



కట్టు కాల్వలో చిట్టడివిని తలపించేలా పెరిగిన చెట్లు



కాల్వలో పూడిక, చెట్లను తొలగిస్తున్న జేసీబీ



పూడిక తొలగించాక కట్టు కాల్వ

కలిసి కట్టుగా ముందుకు...

కోటిలింగాల కెనాల్ మరమ్మతు చేయించుకున్న రైతులు

- 20ఏళ్లుగా నిర్వహణ లేక అందని సాగునీరు
- అధికారులు చేతులెత్తేయడంతో రైతుల ముందడుగు

కారేపల్లి: సుమారు 200కుపైగా ఎకరాలకు సాగునీరు అందించే కట్టుకాల్వ నిర్వహణ లోపంతో పూడుకుపోయింది. ఇరవై ఏళ్లుగా నిర్వహణకు నిధులు రాకపోవడంతో పూడిక తీయడం, చెట్ల తొలగింపు జరగడం లేదు. రైతులు అధికారుల దృష్టికి తీసుకెళ్తే నిధులు రానందున తామేం చేయలేమని చేతులెత్తేశారు. ఇలాగే వదిలేస్తే సాగు చేయడం మానుకోవాల్సిందేనన్న ఆందోళనతో రైతులే తలా ఓ చేయి వేశారు. ఎకరానికి ఇంత చొప్పున నగదు జమ చేసుకుని కాల్వలో పూడిక తీయించుకుని ఈసారి పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.

బుగ్గవాగుపై చెక్‌డ్యాం ద్వారా..

కారేపల్లి మండలంలోని కోటిలింగాల వద్ద బుగ్గవాగుపై ఏళ్ల క్రితం చెక్‌డ్యాం నిర్మించారు. ఆపై భూములకు సాగునీరు సరఫరా చేసేలా కట్టుకాల్వ నిర్మాణం చేపట్టారు. రెండు కి.మీ. పొడవుతో దీన్ని నిర్మించగా.. పేరుపల్లి, జమాళ్లపల్లి, మల్లన్నగూడెం, చంద్రళ్లగూడెం గ్రామాల్లో 120మందికి పైగా రైతులకు చెందిన 200 ఎకరాల భూములకు సాగునీరు అందేది. కానీ ఇరవై ఏళ్ల నుంచి నిర్వహణను మరిచిపోవడంతో చెట్లు పెరిగి, పూడిక నిండి కెనాల్ ఆనవాళ్లు కోల్పోయింది. అంతేకాక ఈ కాల్వ ద్వారా మరికొన్ని భూములకు నీరందించే లింక్ కెనాళ్లలో సైతం నీరు పారడం లేదు.

మనమే చేసుకుందాం...

ఏటా నిధులు వస్తాయని, మరమ్మతులు చేస్తారని రైతులు ఆశించడం.. ఆపై ఫలితం లేకపోవడంతో పంటలు పండించడం కష్టమవుతోంది. దీనికి తోడు కట్టు కాల్వకు మరమ్మతు చేయించాలని ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ అధికారులకు ఆయకట్టు రైతులు విన్నవించడం.. నిధులు లేవని వారు విన్నపాలను పక్కన పెట్టడం ఆనవాయితీగా మారింది. దీంతో ఏటేటా కాల్వలో పూడిక, ఇసుక మేటలు వేయడమే కాక ఏపుగా చెట్లు పెరిగాయి. కొన్నిచోట్ల కెనాల్ గోడలు సైతం కూలిపోయాయి. దీంతో రైతులంతా చేయి చేయి కలిపారు. ఎకరానికి రూ.వెయ్యి చొప్పున జమ చేసుకోవడంతో రూ.లక్ష పోగయ్యాయి. ఈ నిధులతో జేసీబీ మాట్లాడుకుని మూడు రోజులుగా కట్టు కాల్వ మరమ్మతు చేయిస్తుండడంతో బుధవారం రూపురేఖలు వచ్చాయి. దీంతో ఈ ఏడాది సాగుకు నీరు సాఫీగా అందుతుందనే సంతోషంలో ఉన్నారు.

విన్నవించినా పట్టించుకోలేదు..



కాల్వకు మరమ్మతు చేయించాలని ఎన్నోసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించాం. అయినా ఎవరూ మా గోడును పట్టించుకోలేదు. దీంతో చేసేదేం లేక మేమే నగదు జమ చేసుకుని కాల్వ మరమ్మతు చేయించుకుంటున్నాం.

– కంచర్ల శ్రీనివాసరెడ్డి, ఆయకట్టు రైతు, పేరుపల్లి

20 ఏళ్లుగా మరమ్మతులు లేవు..



20ఏళ్లుగా కట్టు కాల్వ మరమ్మతులను మరిచారు. దీంతో పూడిక, తుమ్మ చెట్లు పెరిగి నీరు అందడం లేదు. ఏటా చివరలో సాగునీరు అందక దిగుబడి తగ్గుతోంది. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకుంటే మాపై భారం పడేది కాదు.

– అలెం చంద్రయ్య, ఆయకట్టు రైతు, పేరుపల్లి

సార్వత్రిక సమ్మె సక్సెస్



ఖమ్మంలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



ర్యాలీ సందర్భంగా మాట్లాడుతున్న సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు వీరభద్రం

- ఉద్యోగులు, వ్యవసాయ, రైతు సంఘాలు, పార్టీల మద్దతు
- దుకాణాలు, పారిశ్రామిక ప్రాంతం, బ్యాంకులు బంద్
- పాక్షికంగా తిరిగిన ఆర్టీసీ బస్సులు

ఖమ్మంమయూరిసెంటర్: కార్మికుల హక్కులను కేంద్రప్రభుత్వం హరించడమే కాక నాలుగు లేబర్ కోడ్ల ఏర్పాటును నిరసిస్తూ బుధవారం చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జిల్లాలో విజయవంతమైంది. దుకాణాలు, బ్యాంక్‌లు, పారిశ్రామిక వాడలను బంద్ చేయించగా, ఆర్టీసీ బస్సులు పాక్షికంగా తిరిగాయి. బంద్‌లో సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్, న్యూడెమోక్రసీ నేతలు పాల్గొన్నారు. సమ్మెకు ఉద్యోగులు, వ్యవసాయ, రైతుసంఘాలు మద్దతు తెలపగా, కార్మికసంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యాన ఖమ్మం పెవిలియన్ మైదానం నుంచి జెడ్పీ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అలాగే, ఖమ్మంలో ట్రాక్టర్లతో భారీ ర్యాలీ నిర్వహించగా, జిల్లావ్యాప్తంగా కూడా ర్యాలీలు చేపట్టారు.

ఆర్టీసీకి రూ.72 లక్షలు నష్టం

సార్వత్రిక సమ్మె సందర్భంగా దుకాణాలను మూసివేయించారు. జిల్లా కేంద్రంలో ఆటోలు పూర్తిస్థాయిలో తిరగకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. దీనికి తోడు ఆర్టీసీ బస్సులు కూడా పాక్షికంగానే తిరిగాయి. రీజియన్‌లో 410 బస్సులకు గాను 210బస్సులనే అధికారులు నడిపించారు. రోజువారీగా రావాల్సిన రూ.1.40 కోట్ల ఆదాయంలో బుధవారం రూ.72లక్షల మేర కోత పడింది. ఇక పారిశ్రామిక ప్రాంతంలోని టైల్స్ దుకాణాలు, కోల్డ్ స్టోరేజీలు, దాల్ మిల్లులు, గ్రానైట్ పరిశ్రమలను మూసివేయించారు.

సమ్మె హక్కును కాలరాస్తున్నారు..

సమ్మె సందర్భంగా జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించగా జెడ్పీ సెంటర్ వద్ద వివిధ పార్టీలు, సంఘాల నాయకులు మాట్లాడారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ దేశచరిత్రలో ఎన్నడూ లేని విధంగా సమ్మె జరిగిందని తెలిపారు. కార్మికులకు కష్టం వస్తే ఆదుకునే సంఘాలను తొలగించే కుట్ర జరుగుతోందని మండిపడ్డారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాగం హేమంతరావు, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు, ఎన్‌డీ జిల్లా కార్యదర్శి మధు, కాంగ్రెస్ నాయకుడు కొత్త సీతారాములు తదితరులు మాట్లాడుతూ వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇక బ్యాంకుల ఎదుట కూడా ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో వివిధ సంఘాలు, పార్టీల నాయకులు పోతినేని సుదర్శన్‌రావు, నున్నా నాగేశ్వరరావు, కళ్యాణం వెంకటేశ్వరరావు, వై.విక్రమ్, తుమ్మ విష్ణువర్ధన్, జి.రామయ్య, పి.శోభ, సింగు నరసింహారావు, బీ.జీ.క్లెమెంట్, తోట రామాంజనేయులు, ఎం.డీ.జకీరుద్దీన్, కొండపర్తి గోవిందరావు, దొండపాటి రమేష్, తాటి వెంకటేశ్వర్లు, తాటి నిర్మల, పోటు కళావతి, రామకృష్ణ, రామస్వామి, రాజేష్,కుమార్, బుచ్చిబాబు, బొమ్మకంటి రమేష్, జలం రమేష్, వెంకన్న, శ్రీను, సిల్వరాజు, ఐలయ్య, దాసు, రవి తదితరులు పాల్గొన్నారు.

ఏసీపీపై చర్యలకు రంగం సిద్ధం?

- హెడ్‌క్వార్టర్స్‌కు ఇద్దరు కానిస్టేబుళ్ల అటాచ్
- వ్యాపారి నగదు లాక్కున్న కేసులో నివేదిక రెడీ

ఖమ్మంక్రైం: ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లోని మిర్చి వ్యాపారి గుమస్తాను బెదిరించి రూ.6లక్షల నగదు బ్యాగ్‌ను ఇద్దరు టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్లు బెదిరించి లాక్కున్న ఘటన పోలీస్ శాఖలో కలకలం రేకెత్తించిన విషయం విదితమే. అయితే, వ్యాపారి చాంబర్ ప్రతినిధులను ఆశ్రయించగా వారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో రూ.లక్ష మినహాయించుకున్న కానిస్టేబుళ్లు రూ.5లక్షలు వెనక్కి ఇచ్చేశారు. దీని వెనుక లూప్‌లైన్‌లో ఉన్న ఒక ఏసీపీ స్థాయి అధికారి హస్తం ఉందనే సమాచారంతో నిఘా వర్గాలు విచారణ చేపట్టగా నిజమేనని తేలడంతో ఉన్నతాధికారులు చర్యలకు సిద్ధమైనట్లు సమాచారం. గతంలో వివాదాస్పద ఘటనల్లో చర్యలకు గురైన ఇద్దరు కానిస్టేబుళ్లు, ఓ జర్నలిస్ట్‌తో కలిసి ఈ వ్యవహారానికి పాల్పడినట్లు తేల్చినట్లు తెలిసింది. సదరు జర్నలిస్ట్‌ను ఆన్‌లైన్ ఉద్యోగాల మోసం ఘటనలో కరీంనగర్ సైబర్ క్రైమ్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేసి తీసుకెళ్లారని సమాచారం. కాగా, మిర్చి వ్యాపారి మాత్రం ఇప్పటికీ ఖమ్మం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయకపోవడానికి ఆయనపై వచ్చిన ఒత్తిడే కారణమనే ప్రచారం జరుగుతోంది. అయినప్పటికీ పోలీసులు మాత్రం మిర్చి వ్యాపారి వద్ద పనిచేసే వారికేమైనా సంబంధం ఉందా అన్న కోణంలో విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

ఇప్పటికే పలు ఆరోపణలు

గంజాయి అమ్మిన నగదు తీసుకెళ్తున్నావంటూ మిర్చి వ్యాపారి గుమస్తాను బెదిరించిన ఇద్దరు కానిస్టేబుళ్లు డబ్బు లాక్కున్న వ్యవహారంలో ఓ ఏసీపీ హస్తం కూడా ఉందని నిఘా వర్గాలు గుర్తించాయని సమాచారం. సదరు ఏసీపీపై గతంలోనూ పలు ఆరోపణలు ఉండడంతో ఉన్నతాధికారులకు నివేదిక ఇవ్వగా, చర్యలకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. ఇదే సమయాన ఇద్దరు టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్లను హెడ్‌క్వార్టర్‌కు అటాచ్‌మెంట్ చేయగా, త్వరలోనే సస్పెన్షన్ వేటు పడొచ్చని సమాచారం.

ఇక ఇక్కడ వన్‌వే..



ఖమ్మం బైపాస్‌రోడ్డులో కరుణగిరిపై ఉన్న మున్నేరు బ్రిడ్జి, రైల్వే బ్రిడ్జి మధ్య వన్‌వే ఏర్పాటుచేశారు. మున్నేటిపై పాత బ్రిడ్జిని మూసేయడంతో ఈ మార్గంలో ట్రాఫిక్ పెరిగింది. పాత బస్టాండ్‌కు వచ్చే దారి, దానవాయిగూడెం వెళ్లే జంక్షన్‌లో ట్రాఫిక్ జామ్ అవుతూ ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ట్రాఫిక్ పోలీసులు వన్‌వే అమలుకు నిర్ణయించి బోర్డు ఏర్పాటు చేశారు. – స్టాఫ్ ఫొటోగ్రాఫర్

కొత్తగా 18 సబ్‌స్టేషన్లు

- స్థల సేకరణపై అధికారుల దృష్టి
- ఒక్కో నిర్మాణానికి రూ.1.50 కోట్లు



నూతన విద్యుత్ సబ్ స్టేషన్ నమూనా

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో కొత్తగా 18 విద్యుత్ సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఎన్పీడీసీఎల్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నానాటికీ పెరుగుతున్న కనెక్షన్లు, డిమాండ్‌తో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. డిమాండ్ మేర విద్యుత్ కోటా పెంచుతున్నా సరఫరా సాఫీగా సాగేలా వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యాన అవసరం మేరకు 33/11 కేవీ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి అనుమతించారు. ఖమ్మం సర్కిల్‌లో ఉన్న సర్వీసులు, విద్యుత్ వినియోగం తదితర అంశాలతో ఇచ్చిన నివేదిక ఆధారంగా నూతనంగా 18 సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు ఎన్పీడీసీఎల్ అనుమతి జారీ చేసింది. జిల్లాలో ఇప్పటికే 125 సబ్‌స్టేషన్లు ఉండగా, కొత్తవి ఏర్పాటైతే ఈ సంఖ్య 143కు చేరుతుంది.

20గుంటలకు పైగా..

నూతన సబ్ స్టేషన్ల నిర్మాణం కోసం స్థల సేకరణపై అధికారులు దృష్టి సారించారు. ఒక్కో సబ్‌స్టేషన్ నిర్మాణానికి కనీసం 20 గుంటల నుంచి ఎకరం(40 గుంటలు) మేర స్థలం అవసరమవుతుంది. దీంతో సబ్ స్టేషన్లు ఏర్పాటుచేసే ప్రాంతాల వివరాలతో రెవెన్యూ శాఖకు నివేదిక ఇవ్వగా, అక్కడ స్థలాల గుర్తింపులో ఉద్యోగులు నిమగ్నమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో స్థలాలు సిద్ధంగా ఉన్నందున రెవెన్యూ శాఖ సబ్ స్టేషన్ల నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది. కాగా, ఒక్కో సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.1.50 కోట్లు అవసరమని అంచనా వేయగా, కొన్నిచోట్ల లైన్ల దూరం పెరగనుండడంతో వ్యయంలో మార్పులు ఉంటాయని సమాచారం. ఈమేరకు స్థల సేకరణ ప్రక్రియ త్వరగా పూర్తిచేసి సబ్ స్టేషన్ల నిర్మాణంపై దృష్టి సారించనున్నామని ఖమ్మం ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి తెలిపారు. ఇప్పటికే మాటూరులో సబ్ స్టేషన్ నిర్మాణ పనులు మొదలుపెట్టామని వెల్లడించారు.

నియోజకవర్గాల వారీగా ప్రాంతాల గుర్తింపు

ఖమ్మం నియోజకవర్గంలో టౌన్–4 సెక్షన్‌లోని కబేలా, రఘునాథపాలెం సెక్షన్‌లోని కామంచికల్‌లో సబ్‌స్టేషన్ నిర్మిస్తారు. అలాగే, పాలేరు నియోజకవర్గంలోని తరుణి హాట్, వెంకటగిరి(ఏదులాపురం), అనంతనగర్(రాజేశ్వరపురం), వైరా నియోజకవర్గంలోని తీగలబంజర(కొణిజర్ల), మాధాపురం (కారేపల్లి), బీఆర్.పురం(ఏన్కూరు), రెబ్బవరం (వైరా రూరల్), శాంతినగర్(వైరా టౌన్)లో సబ్‌స్టేషన్ నిర్మాణానికి నిర్ణయించారు. అంతేకాక మధిర నియోజకవర్గంలోని మాటూరు(మధిర రూరల్), లక్ష్మీపురం, బ్రాహ్మణపల్లి, చిరునోముల(బోనకల్), రాయపట్నం(మధిర టౌన్), రేమిడిచర్ల(ఎర్రుపాలెం), సత్తుపల్లి నియోజకవర్గంలోని అన్నారుగూడెం(తల్లాడ), లింగాల(పెద్దకోరుకొండి)లో సబ్‌స్టేషన్లు నిర్మించనున్నారు.

ప్రయోగ ఫలితమేదీ?

- పదేళ్ల క్రితం ఉమ్మడి జిల్లా కేంద్రంగా సైన్స్ మ్యూజియం మంజూరు
- అన్నీ సిద్ధం చేసినా ప్రారంభించని వైనం
- ప్రయోగాత్మక వీక్షణకు దూరమవుతున్న విద్యార్థులు



సైన్స్ మ్యూజియంలోని పరికరాలు, (ఇన్‌సెట్) మానవ అవయవాల వివరాలతో కూడిన ఫ్రేమ్‌లు

ఖమ్మంసహకారనగర్: పాఠ్యపుస్తకాల్లోని అంశాలను విద్యార్థులకు ప్రయోగాత్మకంగా వివరించడం.. బొమ్మల ఆధారంగా వివరాల వెల్లడి ద్వారా సులభంగా అర్థమయ్యేలా చూడడం, తద్వారా వారిలో కొత్త ఆలోచనలను రేకెత్తించడమే లక్ష్యంగా జిల్లా కేంద్రంలో సైన్స్ మ్యూజియం ఏర్పాటుచేశారు. అయితే, పదేళ్ల క్రితం మ్యూజియం మంజూరు కాగా.. అనేక అవాంతరాల నడుమ ఒక్కో అడుగు దాటుతూ వచ్చినా ప్రారంభానికి నోచుకోకపోవడంతో విద్యార్థులకు ప్రయోగాత్మక బోధన అందడం లేదు.

మంజూరైన పదేళ్లకు ఏర్పాటు

2013–14 ఏడాదిలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు అన్ని జిల్లాల్లో సైన్స్ మ్యూజియంలు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. దీంతో ఖమ్మం జిల్లాకు కూడా మ్యూజియం మంజూరైంది. ఇందుకోసం అప్పట్లో రూ.29 లక్షల నిధులను ప్రభుత్వం కేటాయించింది. అయితే, ఈ నిధులను బ్యాంకులో జమ చేసి ఏళ్లు గడిచినా మ్యూజియం ఏర్పాటుకు నోచుకోలేదు. చివరకు 2023–24లో ఈ నిధులు రూ.40 లక్షలకు చేరగా.. అప్పటికి మేల్కొన్న యంత్రాంగం సైన్స్ మ్యూజియం ఏర్పాటుపై దృష్టి సారించింది. ఖమ్మంతో పాటే నిధులు మంజూరైన వరంగల్, సంగారెడ్డి, నారాయణఖేడ్‌ల్లో సైన్స్ మ్యూజియాలు వినియోగంలోకి వచ్చినా ఇక్కడ మాత్రం బాలారిష్టాలు దాటకపోవడం గమనార్హం.

పాత డీఈఓ కార్యాలయంలో..

నిధులు కేటాయించిన పదేళ్లకు ఖమ్మంలోని పాత డీఈఓ కార్యాలయాన్ని సైన్స్ మ్యూజియంకు కేటాయించారు. ఈమేరకు రూ.40లక్షల నిధులను అప్పటి కలెక్టర్ గౌతమ్ మూడు విడతల్లో విడుదల చేశారు. అయితే, ఈ నిధులు సరిపోవనే భావనతో న్యూవోసోల్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ నుంచి రూ.20 లక్షలను సీఎస్‌ఆర్ ఫండ్ కింద ఇచ్చారు. దీంతో భవనానికి అవసరమైన మరమ్మతులు చేయించగా 2024 మే నెలలో భవనం సిద్ధమైంది.

అంతా సిద్ధమైనా..

భవనం ఆధునికీకరణ పూర్తికాగానే అవసరమైన పరికరాలను తెప్పించారు. శాస్త్రవేత్తల చరిత్రను తెలిపే ఫొటోఫ్రేమ్‌లే కాక సోలార్ వ్యవస్థ, జీర్ణవ్యవస్థ, శ్వాసవ్యవస్థ, వ్యర్థాల తొలగింపు, నరాలు, రక్తప్రసరణ, మానవ అస్థిపంజరం, పునరుత్పత్తి, మానవుల ముఖ్య అవయవాల బొమ్మలను అమర్చారు. అప్పుడే మ్యూజియంను ప్రారంభించాలని నిర్ణయించినా, చిన్నచిన్న కారణాలతో సాధ్యం కాలేదు. కార్యాలయంలో మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం లేకపోగా మ్యూజియం నిర్వహణకు అవసరమైన ముగ్గురు ఉపాధ్యాయులను కేటాయించాల్సి ఉంది. వీటిపై జిల్లా స్థాయిలో నిర్ణయం తీసుకునే అవకాశమున్నా అధికారులు ఎందుకు పట్టించుకోలేదో తెలియదు కానీ ఉమ్మడి జిల్లాలో 6నుంచి 10వ తరగతి వరకు చదివే సుమారు 60వేల మంది విద్యార్థులు మ్యూజియం వీక్షణకు దూరమవుతున్నారు. కాగా, మ్యూజియంకు కేటాయించిన నిధుల్లో ఇంకా రూ.15లక్షల వరకు నిల్వ ఉన్నందున అవసరమైన సదుపాయాలు కల్పించి మ్యూజియంను అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.



సోలార్ సిస్టమ్, మానవ అస్థిపంజరం నమూనా

ఇంకొన్ని పనులు ఉన్నాయి..



సైన్స్ మ్యూజియం ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంది. అయితే, విద్యార్థులకు తాగునీరు, టాయిలెట్ సౌకర్యం లేదు. వీటికి తోడు చేయించాల్సిన చిన్నచిన్న మరమ్మతులపై అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అన్నీ సమకూర్చి త్వరలోనే మ్యూజియంను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటాం.

– జగదీశ్వర్, జిల్లా సైన్స్ ఆఫీసర్

క్లుప్తంగా

సరిపడా ఎరువుల నిల్వలు



గోదాంలో తనిఖీ చేస్తున్న డీఏఓ పుల్లయ్య

సత్తుపల్లిటౌన్: వానాకాలం పంటలకు అవసరమైన ఎరువులు జిల్లాలో సరిపడా అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య స్పష్టం చేశారు. సత్తుపల్లి, రామానగరంలోని ఎరువుల దుకాణాలు, గోదాంలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల నిల్వలు, రికార్డులను పరిశీలించాక డీఏఓ మాట్లాడారు. కొరత పేరిట ఎరువుల ధరలు పెంచినా, అనవసరమైన సామగ్రి అంటగట్టినా డీలర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఓ వై.శ్రీనివాసరావు, ఏఈఓలు పాల్గొన్నారు.

నేటి నుంచి ఏఐసీసీ కార్యదర్శి పర్యటన

ఖమ్మంమయూరిసెంటర్: ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి గురువారం నుంచి శనివారం వరకు ఉమ్మడి జిల్లాలో పర్యటించనున్నారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జిగా నియమితులైన ఆయన సంస్థాగత ఎన్నికలు, స్థానిక సంస్థల ఎన్నికలపై దిశానిర్దేశం చేస్తారని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ తెలిపారు. ఈమేరకు 10వ తేదీ గురువారం ఖమ్మంలోని కాంగ్రెస్ కార్యాలయంలో జరిగే మీడియా సమావేశంలో వంశీచంద్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు. అతర్వాత పార్టీ ముఖ్యులు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, ప్రజాప్రతినిధులతో సమావేశమవుతారని తెలిపారు. అలాగే, శుక్ర, శనివారాల్లోనూ ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గాల్లో ఆయన పర్యటిస్తారని వివరించారు.

రేపు జాబ్‌మేళా

ఖమ్మం రాపర్తినగర్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా ఈ నెల 11వ తేదీన ఖమ్మం టేకులపల్లిలోని మోడల్ కెరీర్ సెంటర్‌లో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి ఎన్. మాధవి తెలిపారు. రిలయన్స్ కంపెనీలో 25 రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టులకు అర్హులను ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్‌లతో ఉదయం 10గంటలకల్లా హాజరుకావాలని ఆమె సూచించారు.

సినిమాటోగ్రఫీ రంగంలో నైపుణ్య కోర్సులు

ఖమ్మం సహకారనగర్: సినిమాటోగ్రఫీ రంగంలో స్వల్ప కాలిక నైపుణ్య కోర్సులు ప్రారంభిస్తున్నామని న్యాక్(నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) అసిస్టెంట్ డైరెక్టర్ కె.వెంకటరాజు తెలిపారు. శిక్షణ ప్రీతం అకాడమీ ఆఫ్ సినిమా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్(స్పేస్) సౌజన్యంతో సినిమాటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, సౌండ్ రికార్డింగ్, డబ్బింగ్ అండ్ వాయిస్ ఓవర్ స్కిల్, యాంకరింగ్ అండ్ ఈఎంసీఈఈ, డిజిటల్ డిజైన్ అండ్ సోషల్ మీడియా మేనేజ్‌మెంట్, మ్యూజిక్ ప్రొడక్షన్, ప్రొఫెషనల్ సింగింగ్, ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్ తది తర కోర్సుల్లో 12 వారాల శిక్షణ ఉంటుందని వెల్ల డించారు. ప్రతీ కోర్సుకు రూ.35 వేల ఫీజు నిర్ణయించగా, రెండు కంటే ఎక్కువ కోర్సులకు రాయితీ ఉంటుందని తెలిపారు. హైదరాబాద్ కొండాపూర్‌లోని న్యాక్ అకాడమీలో శిక్షణ ఇవ్వనుండగా, శిక్షణ పూర్తయ్యాక ప్రభుత్వం సర్టిఫికెట్ జారీ చేస్తుందని వెల్లడించారు. వాయిదా పద్ధతిలో ఫీజు చెల్లింపు, రాయితీపై హాస్టల్ వసతి ఉన్నందున ఆసక్తి ఉన్నవారు సద్వి నియోగం చేసుకోవాలని ఏడీ సూచించారు.

రెమ్యూనరేషన్ చెల్లించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మధిర: సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ చెల్లించాలని టీఎస్ యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ సందర్భంగా బుధవారం మధిర తహసీల్దార్ ఆర్.రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి షేక్ నాగూర్ వలీ మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సర్వేను ఉపాధ్యాయులు విజయవంతం చేసినా, ఇప్పటికీ రెమ్యూనరేషన్ చెల్లించలేదన్నారు. దీనికి తోడు డ్యూటీ సర్టిఫికెట్లు మంజూరు చేయకపోవడం సరికాదని పేర్కొన్నారు.

పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఎన్నిక



లక్ష్మణ్, వెంకటేష్

ఖమ్మం మామిళ్లగూడెం: పీడీఎస్‌యూ జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా తిప్పారపు లక్ష్మణ్, ఒంగూరి వెంకటేష్ ఎన్నికయ్యారు. అలాగే, ఉపాధ్యక్షులుగా వినయ్, యశ్వంత్, సహాయ కార్యదర్శులుగా సాధిక్, చందు, కోశాధికారి శశికిరణ్‌ను ఎన్నుకున్నట్లు పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వీ బుధవారం ఖమ్మంలో ప్రకటించారు. ఈసందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్, వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా ఉద్యమాలు చేపడుతామని తెలిపారు.

సాగర్ నీటి విడుదలకు కసరత్తు

- రేపటి హైదరాబాద్ సమావేశంలో తేదీ ఖరారయ్యే అవకాశం
- గత ఏడాది కంటే ముందే విడుదల చేస్తారని రైతుల ఆశలు



కూసుమంచి వద్ద జరుగుతున్న యూటీ నిర్మాణం

ఖమ్మంఅర్బన్: జిల్లాలో ప్రధాన సాగునీటి వనరు అయిన నాగార్జునసాగర్ కాల్వలకు జలాల విడుదలపై ఈనెల 11న హైదరాబాద్‌లో జరగనున్న రాష్ట్రస్థాయి వాటర్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో స్పష్టత వచ్చే అవకాశం ఉంది. వర్షాభావ పరిస్థితులు, డ్యామ్‌లోని నీటి నిల్వలు, సాగు అవసరాలపై చర్చించాక తేదీ ఖరారు చేయనున్నట్లు జలవనరుల శాఖ జిల్లా అధికారులు వెల్లడించారు. కాగా, సాగర్ జలాల ఆధారంగా జిల్లాలోని 17 మండలాల్లో 2.54 లక్షల ఎకరాల ఆయకట్టుతో పాటు అర్బన్ పరిధిలో మరో 10వేల ఎకరాల భూమి సాగవుతోంది. ఈమేరకు వరి నాట్లకు సమయం సమీపిస్తున్నందున నీటి అవసరాలపై జిల్లా జలవనరుల శాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించినట్లు తెలిసింది. ప్రస్తుతం నాగార్జునసాగర్ డ్యామ్ నుండి పాలేరు రిజర్వాయర్‌కు తాగునీటి అవసరాల నిమిత్తం నీరు విడుదల చేస్తున్నారు. అయినా పాలేరు రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యం 23అడుగులకు గాను 15 అడుగుల వరకు మాత్రమే నీరు నిల్వ ఉంది.

ఈనెల రెండో వారంలో...

గతేడాది సాగర్ నుంచి సాగు అవసరాలకు ఆగస్టు 3న నీరు విడుదల చేశారు. కానీ ఈసారి వర్షాభావ పరిస్థితుల నేపథ్యాన ఈనెల రెండో వారంలోనే నీటి విడుదలకు అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వైరా రిజర్వాయర్‌లో కూడా ప్రస్తుతం 16 అడుగుల నీరే ఉంది. అటు పాలేరు, ఇటు వైరా రిజర్వాయర్‌తో పాటు ఇతర జలాశయాల్లో నీటిమట్టం ఆధారంగా సాగర్ నుంచి ముందస్తుగా నీటి విడుదలకు అవకాశముందని ఆయకట్టు రైతులు భావిస్తున్నారు. ఇదే సమయాన సాగర్ కాల్వల పరిధిలో జరుగుతున్న మరమ్మతులను త్వరగా పూర్తిచేయాలని అధికారులు కృషి చేస్తున్నారు. కూసుమంచి మండలంలో గత ఏడాది భారీ వర్షాలతో కోతకు గురైన యూటీ నిర్మాణ పనులను గత పదిరోజులుగా రాత్రీపగలు తేడా లేకుండా యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నారు. నీరు విడుదల కాకముందే పనులు పూర్తిచేసి ఎలాంటి అడ్డంకి లేకుండా చూస్తామని జలవనరులశాఖ అధికారులు చెబుతున్నారు.

ఆశల సాగుకు సిద్ధం

- వైరా రిజర్వాయర్ నుంచి నేడు నీటి విడుదల
- ఆధునికీకరణ పనులను పరిశీలించిన అధికారులు



కాల్వల ఆధునికీకరణ పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ, అధికారులు

వైరా: వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో ఈ ఏడాది వానాకాలం పంటల సాగుకు అన్నదాతలు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు 60 శాతానికి పైగా పూర్తయ్యాయి. మరో మూడు రోజుల్లో పనులు నిలిపివేసి, తిరిగి వచ్చే ఏడాది చేపట్టాలనే నిర్ణయానికి అధికారులు వచ్చినట్లు తెలిసింది. ఈ రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో ఇప్పటికే రైతులు వరి నారుమడులు సిద్ధం చేసుకుని, నాట్లు వేసేందుకు సరైన వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ ఏడాది రిజర్వాయర్ కింద సుమారు 25 వేల ఎకరాల్లో వరి సాగు చేసే అవకాశముందని అంచనా వేస్తున్నారు.

నేడు నీరు విడుదల

రిజర్వాయర్ ఆధునికీకరణ పనులను బుధవారం నీటి పారుదల శాఖ ఎస్ఈ ఎం.వెంకటేశ్వరరావు, ఈఈ బాబూరావు, డీఈ శ్రీనివాస్ పరిశీలించారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 16అడుగుల మేర నీరు ఉండడంతో నారుమళ్లకు విడుదల చేసేందుకు ఎలాంటి ఇబ్బందులు లేవని తేల్చినట్లు సమాచారం. దీంతో అనధికారికంగా గురువారం నుంచి నీరు విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఆధునికీకరణ పనుల్లో భాగంగా కుడి, ఎడమ కాల్వల లైనింగ్ పనులు పూర్తయినందున నీరు విడుదల చేస్తే ఒకే రోజులో చివరి ఆయకట్టు భూములకు సైతం నీరు చేరే అవకాశముందని భావిస్తున్నారు. ఈనేపథ్యాన రైతులు వరి నాట్లు వేసుకునేలా వారం పాటు నీరు విడుదల చేయాలని నిర్ణయించగా, నీటిని పొదుపుగా వాడేలా పర్యవేక్షణకు సిబ్బందిని నియమిస్తారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బైక్‌పై 10వేల కి.మీ. ఆధ్యాత్మిక యాత్ర



శృంగేరిలో ఆలయం వద్ద ప్రవీణ్‌కుమార్, శరత్‌కుమార్

సత్తుపల్లి: దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలను ద్విచక్ర వాహనంపై చుట్టి రావాలని యువకుడు ఆ కోరిక నెరవేర్చుకున్నాడు. సత్తుపల్లి ద్వారకాపురి కాలనీకి చెందిన పురోహితుడు ఉప్పల ప్రవీణ్ శాస్త్రి చాలాకాలంగా రాయల్ ఎన్‌ఫీల్డ్‌పై దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలను సందర్శించాలని నిర్ణయించుకున్నాడు. తొలుత పలువురు మిత్రులు కూడా కలిసొస్తామని చెప్పినా ఆతర్వాత వెనుకడుగు వేయడంతో బంధువైన శరత్‌కుమార్ వర్మతో కలిసి యాత్ర ప్రారంభించాడు. చెరో బైక్‌పై హైదరాబాద్‌లో ప్రయాణం ఆరంభించిన వారు నెల వ్యవధిలో 10వేల కి.మీ. మేర ప్రయాణించారు. ఈ క్రమంలో తెలంగాణ ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, హర్యానా, హరిద్వార్, ఉత్తరప్రదేశ్, బిహార్, జార్ఖండ్, ఒడిశా మీదుగా ఏపీలోని శ్రీకాకుళం నుంచి తిరిగి తెలంగాణలోకి తిరిగి ప్రవేశించినట్లు ప్రవీణ్ తెలిపారు. చార్‌ధామ్‌తో పాటు ఉత్తర, దక్షిణ భారతదేశంలోని అన్ని ముఖ్య క్షేత్రాలను సందర్శించిన ఆయనను సృజన సాహితీ సమాఖ్య బాధ్యులు బుధవారం సత్కరించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, మధుసూదన్‌రాజు, నాగేశ్వరరావు, నర్సింహారావు, రామిశెట్టి శ్రీనివాసరావు, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

ఐటీడీఏ పీఓ రాహుల్

అశ్వాపురం: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఐటీడీఏ పీఓ రాహుల్ అన్నారు. అశ్వాపురం మండలంలోని గొందిగూడెం ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులకు బోధిస్తున్న పాఠ్యాంశాలను పరిశీలించి, మూడు నుంచి ఐదు తరగతుల విద్యార్థులతో ఇంగ్లిష్ పదాలను బోర్డుపై రాయించారు. తరగతి గదిలో కూర్చుని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ప్రతిరోజూ మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఇంగ్లిష్ పదాలు బోర్డుపై రాయించి తెలుగులో అర్థాలు చెప్పేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. వ్యాసరచన, క్విజ్, నాటికలు, ఏకపాత్రాభినయంపై పిల్లలకు అవగాహన కల్పించాలని, వర్షాకాలం నేపథ్యంలో వారి ఆరోగ్యంపై దృష్టి సారించాలని ఆదేశించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చందు, వార్డెన్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



రద్దీగా ఉన్న పాత బస్టాండ్

అటు కళకళ.. ఇటు వెలవెల



కొత్త బస్టాండ్‌లో పలచగా ఉన్న ప్రయాణికులు

సార్వత్రిక సమ్మె సందర్భంగా ఖమ్మంలోని కొత్త బస్టాండ్ జనం లేక వెలవెలపోగా.. పాత బస్టాండ్ మాత్రం కిక్కిరిసి కనిపించింది. సమ్మె విషయం ముందుగానే తెలియడంతో దూర ప్రాంతాల నుంచి ప్రయాణికులు రాకపోవడంతో కొత్త బస్టాండ్ బోసిపోయింది. ఇక స్థానికులు, గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే వారు రోజుమాదిరిగానే రావడం.. మధ్యాహ్నం వరకు బస్సులు నడిపించకపోవడంతో ప్రయాణికులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్

టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుతో ఆస్తులకు రక్షణ

- పాలకుల అలసత్వంతోనే ఆలయ అధికారులపై దాడులు
- దేవాదాయ అర్చక, ఉద్యోగ జేఏసీ ప్రతినిధులు



ఖమ్మంలో నిరసనలో పాల్గొన్న ఆలయాల ఉద్యోగ, అర్చకులు



నేలకొండపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న అర్చక, ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: దేవాలయాల ఆస్తుల పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటుచేయాలని దేవాదాయ, ధర్మాదాయ అర్చక, ఉద్యోగ జిల్లా జేఏసీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయ భూముల పరిరక్షణకు వెళ్లిన ఈఓ రమాదేవిపై ఏపీలోని పురుషోత్తమపట్నం గ్రామస్తుల దాడి నేపథ్యాన బుధవారం జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో అర్చక, ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఖమ్మంలోని శ్రీ గుంటుమల్లన్న ఆలయంలో జేఏసీ ప్రతినిధులు దాములూరి వీరభద్రరావు, తోటకూర వెంకటేశ్వర్లు మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన హైడ్రా తరహాలో దేవాదాయ ఆస్తుల రక్షణకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తద్వారా ఆలయ భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడొచ్చని తెలిపారు. కాగా ఆలయ భూముల రక్షణలో పాలకుల అలసత్వం ఉండడంతో ఉద్యోగులపై దాడులు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ఉద్యోగులపై రాజకీయ ఒత్తిడి లేకుండా చూస్తూ భూముల పరిరక్షణపై దృష్టి సారించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రతినిధులు కె.జగన్మోహన్‌రావు, ఈ.వెంకటేశ్వర్లు, అనిల్, ఆనంద్, చుండూరి రామకోటేశ్వరరావు, కె.రామశర్మ, ప్రసాద్, వేణుగోపాలాచారి, హరిచంద్రశేఖర్, కృష్ణమాచార్యులు, శ్రీకాంత్, మునగలేటి రమేష్ శర్మ, ఆమంచి సురేష్ శర్మ, భార్గవాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఈఓపై దాడి సరికాదు..

నేలకొండపల్లి: భద్రాచలం ఆలయ ఈఓపై దాడి చేయడం సరికాదని అర్చకుల సంఘం బాధ్యుడు సౌమిత్రి రమేష్ పేర్కొన్నారు. దాడిని నిరసిస్తూ నేలకొండపల్లిలో అర్చక, ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించిన నిరసన తెలిపారు. ఈ సందర్భంగా భక్తరామదాసు ధ్యాన మందిరం వద్ద రమేష్ మాట్లాడుతూ దాడులకు బాధ్యులైన వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్చకులు కొడవటిగంటి శివయ్య, ముడుంబ రామానుజచార్యులు, హరి, సిబ్బంది కళ్యాణి, పల్లపుశ్రీను, పి.కృష్ణ పాల్గొన్నారు.

సింగరేణిలో ఏడుగురు సివిల్ అధికారుల బదిలీ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో పలువురు సివిల్ అధికారులను బదిలీ చేశారు. ఎస్టీపీపీ నుంచి జి.శివప్రసాద్‌ను మణుగూరు డీజీఎంగా, కార్పొరేట్ విజిలెన్స్ డీజీఎం జి.రాంచందర్‌ను ఎస్టీపీపీ డీజీఎంగా, మణుగూరు ఎస్ఈ బీవీఎస్.పాత్రుడును ఎస్టీపీపీకి, ఆర్జీ–3 ఎస్ఈ పి.రాజేంద్రప్రసాద్‌ను కొత్తగూడెంకు, సివిల్ హెచ్ఓడీ శ్రీనాథ్‌ను కార్పొరేట్‌కు, ప్రజ్వలను ఇల్లెందుకు, మేనేజ్‌మెంట్ ట్రైనీ రాంచరణ్‌ను మణుగూరుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందాయి.

కుమారుడు అమెరికా చేరకముందే తండ్రి మృతి

ఆర్టీసీ అధికారుల ఒత్తిడే కారణమని కుటుంబీకుల ఆరోపణ



శ్రీనివాసరావు (ఫైల్)

చింతకాని: మధిర ఆర్టీసీ డిపో ఉద్యోగి రామిశెట్టి శ్రీనివాసరావు(53) బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన మృతికి ఆర్టీసీ అధికారుల ఒత్తిడే కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. అయితే, ఎంఎస్ చదివేందుకు కుమారుడిని మంగళవారమే అమెరికా విమానం ఎక్కించగా.. ఆయన అక్కడకు చేరకముందే తండ్రి మృతి చెందడం విషాదాన్ని నింపింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం బుర్హాన్‌పురంలో నివాసముండే శ్రీనివాసరావు మధిర డిపో టైర్ సెక్షన్‌లో విధులు నిర్వర్తిస్తుండగా పదోన్నతి వచ్చి ఏడాది పూర్తి కావొస్తోంది. ఆయన మంగళవారం సెలవులో ఉండగా, ప్రొబేషనరీ పీరియడ్‌లో ఉన్నందున తప్పక విధులకు హాజరుకావాలని అధికారులు బుధవారం ఉదయం ఫోన్ చేసినట్లు తెలిసింది. అయితే, సమ్మెతో బస్సులు లేనందున రైలులో ఖమ్మం నుంచి బయలుదేరాడు. మార్గమధ్యలో చింతకాని చేరే సరికి ఆయన గుండెనొప్పి రావడంతో అక్కడే దిగి డిపో అధికారులకు ఫోన్ చేయగా ఆస్పత్రిలో పరీక్ష చేయించుకుని విధులకు రావాలని స్పష్టం చేసినట్లు సమాచారం. దీంతో స్థానికుల సాయంతో పీహెచ్‌సీకి వెళ్లగా అక్కడ డాక్టర్ ఆల్తాఫ్ పరీక్షించి పరిస్థితి విషమంగా తేల్చి 108కు సమాచారం ఇచ్చారు. కానీ ఖమ్మం నుంచి 108 వాహనం వచ్చేలోగా గుండెపోటు రావడంతో వైద్యులు సీపీఆర్ చేసినా ఫలితం లేక మృతి చెందాడు. డిపో అధికారుల ఒత్తిడితోనే తన భర్త గుండెపోటుతో మృతి చెందాడని శ్రీనివాసరావు భార్య రమాదేవి ఆరోపించారు. వీరి ఏకైక కుమారుడు రామ్‌చరణ్‌ను ఎంఎస్ చదివించేందుకు మంగళవారమే అమెరికా పంపించగా, ఆయన అక్కడకు చేరకముందే శ్రీనివాసరావు మృతి చెందడంతో కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆత్మహత్య



తాండ్ర అనిల్ (ఫైల్)

మధిర: మధిరకు చెందిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగి బుధవారం రైలుకింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మధిరఆర్‌సీఎం చర్చి రోడ్డులో నివసించే తాండ్ర అనిల్ (45) మున్సిపాలిటీలో 2008 నుంచి ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఆయన భార్య ఉమ ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తుండగా, అనిల్ ఇటీవల ఎవరితో సరిగా మాట్లాడడం లేదని తెలిసింది. బుధవారం సోదరుడు హరికి ఫోన్‌చేసి ఆత్మహత్యకు పాల్పడుతున్నానని చెప్పాడు. ఆపై సోదరుడు గాలిస్తుండగానే మధిర స్టేషన్ సమీపాన గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాలా, అధికారుల ఒత్తిడితో అనిల్ ఆత్మహత్య చేసుకున్నాడా అనేది తేలాల్సి ఉంది. కేసు నమోదు చేసినట్లు జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి

మోతె: బైక్‌పై వెళ్తూ డివైడర్ ఢీకొన్న యువకుడు తీవ్రగాయాలతో మృతి చెందాడు. ఇదే ఘటనలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. సూర్యాపేట జిల్లా మోతె సమీపాన బుధవారం జరిగిన ఈ ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురానికి చెందిన బుర్రి వర్ధన్‌బాబు(22) తన స్నేహితుడు కంచర్ల తరుణ్‌తో కలిసి బుధవారం హైదరాబాద్ నుంచి బైక్‌పై స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో మోతె సమీపాన అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించే క్రమాన డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, స్థానికులు సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే వర్ధన్‌బాబు మృతిచెందాడు. మృతుడి తండ్రి ప్రభాకర్‌రావు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు మోతె ఎస్సై యాదవేందర్‌రెడ్డి తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

ఎర్రుపాలెం: మండలంలోని బుచ్చిరెడ్డిపాలెంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.13,980 నగదు, సెల్ ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ రమేష్ తెలిపారు.

బాలికకు గర్భం చేసిన వ్యక్తిపై కేసు

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడుతండాలో 16ఏళ్ల బాలికను మాయమాటలతో లొంగదీసుకుని ఆమె గర్భానికి కారణమైన వ్యక్తిపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. బచ్చోడుతండాకు చెందిన బాలిక 8వ తరగతి పూర్తిచేశాక ఇంటి వద్దే ఉంటోంది. అదే తండాకు చెందిన ధరావత్ బాలు ఆమెకు మాయమాటలు చెప్పి శారీరకంగా లొంగదీసుకోవడం గర్భం దాల్చింది. ఈ విషయమై బాలిక తల్లి ఫిర్యాదుతో బాలుపై కేసు నమోదు చేసి, బాలికను బాలికల సదనంకు పంపించినట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్ట్



స్వాధీనం చేసుకున్న గంజాయితో పోలీసులు

కల్లూరు: కల్లూరులో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్ చేయగా, నిందితుల నుంచి 822 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఏసీపీ రఘు బుధవారం వివరాలు వెల్లడించారు. కల్లూరు ఎస్సై డి.హరిత మంగళవారం మధ్యాహ్నం తనిఖీలు చేస్తుండగా లక్ష్మీపురం రోడ్డులో ముగ్గురు యువకులు పారిపోయేందుకు యత్నించాడు. దీంతో వీరిని వెంబడించి అదుపులోకి తీసుకోగా కల్లూరుకు చెందిన ఎస్‌కే.హమీద్, మణుగూరు సాయినగర్‌కు చెందిన ఎస్‌కే.హబీబ్‌పాషా, మిడియం గోవిందుగా తేలింది. గంజాయికి అలవాటు పడిన వీరు ఒడిశాకు వెళ్లి రూ.3,500 చొప్పున నాలుగు కేజీల గంజాయి కొనుగోలు చేశారు. అందులో కొంత సొంత అవసరాలకు ఉంచుకుని, మిగతాది చిన్న ప్యాకెట్లుగా మార్చి అమ్ముతున్నారు. ఈమేరకు నిందితులను అరెస్ట్ చేసి గంజాయి, బైక్‌లు స్వాధీనం చేసుకోవడమే కాక గంజాయి ఉపయోగించిన 19 మందిని సీఐ ముత్తులింగం ఆధ్వర్యాన గుర్తించినట్లు ఏసీపీ తెలిపారు.

- చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం బస్టాండ్ సమీపాన గంజాయి తాగుతున్న ఖమ్మం ప్రకాశ్‌నగర్‌కు చెందిన బి.వంశీని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. ఆయన వద్ద సిగరెట్ రూపంలో ఉన్న గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లైయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.